క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం గీతా

కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం గీతా తెలిపారు. ఈ నెల 14వ తేదీ చాగలమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో పాఠశాలకు చెందిన నాగ ఉదయ్, కాశీం, ఆసీఫ్, వేణు, యశ్వంత్, అన్వర్, తేజ, మధు, ఆఫ్రిన్ ప్రతిభ చాటారన్నారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. క్రీడాకారులను హెచ్ఎంతోపాటు ఫిజికల్ డైరెక్టర్లు ఓబులేసు, హర్ష, ఉపాధ్యాయులు అభినందించారు.

కనులపండువగా పల్లకీ సేవ



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి కర్పూర నీరాజనాలు పలికారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఈఓ చంద్రుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకుల ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

డోన్ రూరల్: కొద్ది రోజుల క్రితం జరిగిన రైల్వే యూనియన్ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం సాధించిన నేపథ్యంలో యూనియన్ సెక్రటరీ అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో సోమవారం డోన్‌లో ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహానికి శంకర్‌రావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైల్వే కార్మికులకు అండగా ఉంటామన్నారు. యూనియన్ నాయకులు కుమార్, నాగరాజు, సుధాకర్, నజీర్, దామోదర్‌రెడ్డి, బాషా, సుబ్బయ్య పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు



స్వాధీనం చేసుకున్న బైక్, నాటుసారాను చూపిస్తున్న సీఐ వరలక్ష్మి

డోన్ రూరల్: నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో దాడులు నిర్వహించామన్నారు. సారా విక్రయిస్తున్న ప్యాపిలి మండలం ఊటకొండ గ్రామానికి చెందిన బండి బండ్డెప్ప, అలేబాద్‌తండా గ్రామానికి చెందిన మాధవత్ రామునాయక్‌ను అరెస్టు చేశామని తెలిపారు. వారి వద్ద నుంచి 65 లీటర్ల సారా, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. 2 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని వివరించారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. కర్నూలు సీఐ జయరాంనాయక్, ఎక్సైజ్ ఎస్ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

ప్యాపిలి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు అధిక లాభాలు వస్తాయని తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులతోనే పంటలను సాగు చేయాలని సూచించారు. అవే పర్యావరణానికి, ఆరోగ్యానికి మంచిదన్నారు.

హైవే కల.. సాకారం

- గత ప్రభుత్వ హయాంలో జాతీయ రహదారి మంజూరు
- నంద్యాల–జమ్మలమడుగు నేషనల్ హైవేకు రూ.934 కోట్లు
- కొనసాగుతున్న స్ట్రక్చర్ల పనులు
- 84 కి.మీ జాతీయ రహదారి
- నాలుగు ప్రాంతాల్లో బైపాస్ రోడ్లు
- పలు రాష్ట్రాలకు అనుసంధానం





జాతీయ రహదారిగా మారనున్న నంద్యాల- జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రోడ్డు, నంద్యాల-జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారిలో జరుగుతున్న స్ట్రక్చర్ల పనులు

కోవెలకుంట్ల: డబుల్‌లేన్‌గా ఉన్న నంద్యాల–జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారి హైవే అవుతుండడంతో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజల ఏళ్లనాటి కల సాకారమవుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నంద్యాల- జమ్మలమడుగు జాతీయ రహదారిని మంజూరు చేసి అప్పట్లోనే రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించింది. ప్రస్తుతం ఈ రహదారి నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు ఉన్న 167 నేషనల్ హైవే రోడ్డు పొడిగింపులో భాగంగా ఈ రహదారి నేషనల్ హైవేగా మారుస్తున్నారు. పది మీటర్ల వెడల్పు, రోడ్డుకు ఇరువైపులా మూడున్నరమీటర్ల బరమ్‌తో సువిశాలమైన రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నంద్యాల నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు వరకు 84 కి.మీ మేర జాతీయ రహదారిని ఏర్పాటు చేయడానికి రూ. 934 కోట్ల నిధులు కేటాయించారు. బైపాస్‌లు ఏర్పాటయ్యే ప్రాంతాల్లో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారికి ఇప్పటికే నష్టపరిహారం అందించారు.

వేగవంతంగా స్ట్రక్చర్ల నిర్మాణ పనులు

నంద్యాల- జమ్మలమడుగు జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భూసేకరణకు రూ. 135కోట్లు కేటాయించారు. 84 కి.మీ రోడ్డు ఏర్పాటు కావాల్సి ఉండగా రెండు భాగాలుగా నిర్మాణం చేపడుతున్నారు. నంద్యాల సమీపంలోని 186/02 కి.మీ నుంచి కానాల, గోస్పాడు, కోవెలకుంట్ల, సంజామల మండలం నొస్సం సమీపంలోని 248/010 కి.మీ వరకు 62 కిలోమీటర్ల మేర విభజించారు. అక్కడి నుంచి వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం గుల్లకుంట మీదుగా జమ్మలమడుగు వరకు 22 కి.మీ మేర మరో విభాగంతో రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. భూసేకరణ, రోడ్డు నిర్మాణానికి సంబంధించి నిధులు విడుదల కాగా పది మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణంతో పాటు నంద్యాల మండలం కానాల, గోస్పాడు, కోవెలకుంట్ల, సంజామల మండలం నొస్సం ప్రాంతాల్లో బైపాస్‌రోడ్లు ఏర్పాటు చేసేలా అలైన్‌మెంట్ రూపొందించారు. కోవెలకుంట్ల శివారులో జగనన్న కాలనీ మీదుగా బైపాస్ వెళుతుంది. ఈ ప్రాంతంలో 33 మంది ఇళ్లపట్టాలు ఇవ్వగా కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. భూసేకరణలో ఆ ప్లాట్లు రోడ్డు నిర్మాణంలో పోతుండడంతో వారికి నష్టపరిహారంతోపాటు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత నెలాఖరు నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపం నుంచి స్ట్రక్చర్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జమ్మలమడుగు- నంద్యాల మార్గమధ్యలో ముందుగా స్ట్రక్చర్లను ఏర్పాటు చేసిన అనంతరం రోడ్డు నిర్మాణ పనులు చేప ట్టేలా ఆర్‌అండ్‌బీ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై ఇక రయ్..రయ్:

నంద్యాల- జమ్మలమడుగు జాతీయ రహదారి ఏర్పాటుతో పలు రాష్ట్రాలకు కనెక్టివిటీ కానుంది. దీంతో ఈ రహదారిలో వాహనాలు రయ్..రయ్‌గా నడువనున్నాయి. నంద్యాల మండలం కానాల సమీపంలో ఉన్న నేషనల్ హైవే నుంచి వైఎస్సార్‌జిల్లా జమ్మమడుగు సమీపంలోని కన్నెలూరు వద్ద జాతీయ రహదారికి రోడ్డు అనుసంధానం అవుతుంది. జాతీయ రహదారి ఏర్పాటుతో నంద్యాల మీదుగా బెంగళూరుకు దగ్గరి మార్గం అవుతుంది. అలాగే రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాలతోపాటు హైదరాబాద్, చెన్నై, బళ్లారి ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది. స్ట్రక్చర్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతుండడం, వీలైనంత త్వరలో జాతీయ రహదారి ఏర్పాటు కానుండడంతో ప్రయాణికులకు రోడ్డు ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. ఈ రహదారిలో పలుచోట్ల బైపాస్ రోడ్డు ఏర్పాటు కానుండడంతో రహదారిలో ట్రాఫిక్ కష్టాలు, రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా సరక్షిత ప్రయాణానికి మార్గం సుగమం కానుంది.

ప్రయాణం సులభతరం



నంద్యాల–జమ్మలమడుగు రహదారి నేషనల్ హైవేగా మారనుండడంతో ప్రయాణం సులభతరం కానుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు పక్క రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలకు దగ్గరి మార్గం అవుతుంది. బెంగళూరు, చెన్నై, బళ్లారి, తదితర ప్రాంతాలకు రోడ్డు మార్గం ద్వారా త్వరగా చేరుకునే వీలు కలుగుతుంది. –లింగమయ్య, కోవెలకుంట్ల

త్వరితగతిన పూర్తి చేయాలి



నంద్యాల– జమ్మలమడుగు డబుల్ లేన్‌గా మారనుంది. ఈ రహదారిలో ప్రస్తుతం స్ట్రక్చర్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గతంలోనే ఈ ప్రతిపాదన ఉండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల కల నెరవేర్చింది. వీలైనంత త్వరలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి జాతీయ రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

–ప్రతాప్‌రెడ్డి, భీమునిపాడు, కోవెలకుంట్ల

దరఖాస్తుల ఆహ్వానం

డోన్ రూరల్: మండల పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కె.నాగమణి అన్నారు. అభ్యర్థులకు డోన్‌లో ఈ నెల 29వ తేదీ 80 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

- బేతంచెర్ల: మండలంలో ఇంటర్ పాసై 18–40 ఏళ్ల అభ్యర్థులు రేషన్ డీలర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ప్రకాశ్ బాబు తెలిపారు. కనుమకింది కొట్టాల–ఎస్సీ, కొమ్మారి కొట్టాల–ఎస్టీ మహిళ, బేతంచెర్ల పట్టణంలో షాపు నంబర్ 1330002–ఎస్సీ, 1330046 –ఎస్సీ, 1330047 ఓసీ(మహిళ), కొలుములపల్లె బీసీ–డీ (మహిళ), రంగాపురం బీసీ–ఈ, గూటుపల్లె బీసీ–ఏకు కేటాయించినట్లు వెల్లడించారు.

రేషన్ డీలర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల: నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ పోస్టుల భర్తీకి సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. బనగానపల్లె మండలంలో 21, పసుపలలో ఒకటి, కోవెలకుంట్ల మండలంలోని పెద్దకొప్పెర్ల, ఎం. గోవిందిన్నె, కోవెలకుంట్ల, అవుకు మండలంలోని రామాపురం, వేములపాడు, కోనాపురం, అవుకు పట్టణంలో రేషన్ డీలర్ల భర్తీకి చర్యలు తీసుకున్నారు. ఇంటర్ వరకు చదువుకుని 18 నుంచి 40 ఏళ్లలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 23వ తేదీ లోపు దరఖాస్తులను రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా నేరుగా డోన్ ఆర్‌డీఓ కార్యాలయంలో అందజేయాలని కోవెలకుంట్ల తహసీల్దార్ పవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలకు ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

డోన్ మండలంలోని ఖాళీలు

పేరు	షాపు నంబర్	రిజర్వేషన్ కేటగిరి
డోన్	1385010	ఓసీ(మహిళ)
డోన్ టౌన్	1385075	బీసీ–బీ
డోన్ టౌన్	1385076	ఓసీ (మహిళ)
డోన్ టౌన్	1385077	ఎస్సీ
ఎద్దుపెంట	1349025	బీసీ–ఏ(మహిళ)
ఎస్.గుండాల	1349027	ఓసీ
చనుగొండ్ల-1	1349028	బీసీ–బీ(మహిళ)
కొత్తకోట	1349030	ఓసీ
దేబరబండ	1349031	ఎస్సీ
ఉంగరానిగుండ్ల	1349033	బీసీ–ఏ
ఆవులదొడ్డి	1349046	ఓసీ
వెంకటాపురం	1349051	ఎస్సీ
చనుగొండ్ల-2	1349073	బీసీ–డీ
ధర్మవరం	1349074	బీసీ–బీ



వేంకటేశ్వరస్వామి పల్లకీ సేవలో భక్తులు

వేడుకగా ధనుర్మాస పూజలు

డోన్: ధనుర్మాసం ప్రారంభం కావడంతో సోమవారం డోన్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాము శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

శివాలయంలో ప్రత్యేక పూజలు

డోన్: స్థానిక ఇందిరానగర్ వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన శివాలయంలో ధనుర్మాస మొదటి సోమవారం పూజలు వైభవంగా జరిగాయి. వేకువజాము నుంచే భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు విజయ్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

గుండెపోటుతో మాజీ వార్డు సభ్యుడు మృతి

- సకాలంలో రాని 108వాహనం



నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: పెట్నికోటకు చెందిన మాజీ వార్డు సభ్యుడు వారాధి పెద్దన్న(62) గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సోమవారం ఎస్సీ కాలనీలోని మృతుని నివాసం చేరుకుని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆదివారం రాత్రి పెద్దన్న గుండెపోటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు 108 కాల్ సెంటర్‌కు సమాచారం ఇచ్చారు. కొలిమిగుండ్లకు చెందిన వాహనం అందుబాటులో లేదని అవుకు నుంచి పంపిస్తామని చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు. చాలా సీరియస్‌గా ఉంది బైక్‌లో కొలిమిగుండ్లకు వస్తున్నామని ఎదురుగా వస్తే సరిపోతుందని చెప్పినా అడ్రస్ పేరుతో కాలయాపన చేశారని ఆరోపించారు. బైక్‌లోనే కొలిమిగుండ్ల పీహెచ్‌సీకి తీసుకువెళ్లగా తాళాలు వేసి సిబ్బంది ఎవరూ అందుబాటులో లేరు. అక్కడి నుంచి స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో అవుకు సీహెచ్‌సీకి తీసుకెళ్లే క్రమంలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు

బేతంచెర్ల: పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో స్కూటరిస్టుకు తీవ్ర గాయాలైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన సుధాకర్ ద్విచక్రవాహనంపై బేతంచెర్లకు వస్తున్నాడు. కొత్త బస్టాండ్ వద్ద అయ్యలచెర్వు వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. సుధాకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు.

ఎస్ఏ పరీక్ష రద్దు

కొలిమిగుండ్ల: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న ఎస్ఏ–1 పరీక్ష సోమవారం రద్దయింది. గణితం పేపర్ ఎక్కడో లీకై నట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరీక్షను వాయిదా వేసినట్లు ఎంఈఓ అబ్దుల్‌కలాం తెలిపారు. సంబంధిత పరీక్ష పత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రంగా ఉంచామన్నారు. వాయిదా పడిన పరీక్షను మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తెలుపుతామని పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

డోన్ టౌన్ : ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి వారి మన్ననలను పొందగలిగినప్పుడే సంస్థ పురోగతి సాధిస్తుందని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని హెడ్ పోస్టాఫీసును ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సేవల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని వస్తున్న ఆరోపణలపై అసహనం వ్యక్తం చేశారు. మరోసారి పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖాతాదారులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదన్నారు.

24 నుంచి చండీయాగం

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు చండీయాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి హాజరుకానున్నట్లు చెప్పారు.

రాయలసీమ స్థాయి లెదర్ బాల్ క్రికెట్ టోర్నీ

జమ్మలమడుగు: క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాయలసీమ స్థాయి లెదర్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు వై.కె. కిరణ్, విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం జమ్మలమడుగులోని సీఎస్ఐ గ్రౌండ్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. పోటీల్లో పాల్గొనదలచిన జట్లు రూ.1500 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈ నెల 20వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 21వ తేదీ నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. విజేతలకు వరుసగా.. రూ.70వేలు, రూ.40వేలు, రూ.15 వేలు అందజేస్తారన్నారు. వివరాలకు సెల్ 9666198552 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వచ్చారు.. వెళ్లారు..!



స్పందనలో కూర్చున్న ముగ్గురు అధికారులు

కొలిమిగుండ్ల: ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి స్పందన కరువైంది. తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో వీసీ పని చేయకపోవడంతో తహసీల్దార్ కార్యాయలంలోనే అధికారులు హాజరయ్యారు. మధ్యాహ్నం 12గంటలకే వివిధ శాఖల అధికారులు ఎవరి పనిమీద వాళ్లు వెళ్లిపోయారు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాత్రమే వీసీలో ఉన్నారు. మిగిలిన మండల స్థాయి అధికారులు కనిపించకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ప్రజలు సైతం తమ సమస్యల కోసం ఎవరూ పెద్దగా రాలేదు.

ముచ్చట్ల మల్లికార్జునస్వామికి విశేష పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



స్వామి సన్నిధిలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్‌కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో ధనుర్మాసం తొలి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ చేసి మహా మంగళహారతి ఇచ్చారు. స్వామివారిని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఉమామహేశ్వరమ్మ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

పొలం రస్తాల ఆక్రమణ



ఇరుకుగా ఉన్న కాలిబాటల్లో వెళుతున్న రైతులు

కొలిమిగుండ్ల: పొలాలకు చేరుకునే రస్తాలు ఒకప్పుడు విశాలంగా ఉండడంతో రైతులు సులభంగా పంట పొలాల వద్దకు చేరుకునేవారు. కాలక్రమేణా రస్తాలు ఆక్రమణలకు గురికావడంతో చివరకు కాలిబాటలుగా మారిపోయాయి. ఈ పరిస్థితి తిమ్మనాయినపేటలో నెలకొంది. గ్రామంలో ప్రజలు పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. రస్తాలకు ఆనుకుని ఉన్న వాళ్లు ఒకరిని చూసి మరొకరు ఆక్రమించుకోవడంతో దూరంగా ఉన్న పొలాలకు రాకపోకలు సాగించాలన్నా తీవ్ర కష్టాలు పడాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువగా భాగం పసుపు, వరి ఇతర పంటలు పండిస్తుంటారు. విత్తనం మొదలుకొని పంట ఉత్పత్తులను ఇంటికి చేర్చాలంటే పడరాని పాట్లు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. చిన్నగా మారిన గట్లపై నడిచే వెళ్లే సమయంలో అదుపు తప్పి కింద పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. గడ్డి మోపులు, పంట దిగుబడులు తీసుకురావాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలో మంగళవారం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, అయ్యప్ప స్వామి గుడి, శ్రీకృష్ణనగర్, పుండరీనగర్, కురుకుంద కాలనీల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనుల కారణంగా విద్యుత్ ఉండదని తెలిపారు.

సీపీఐ నేత ఖాశీం సాహెబ్ మృతి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

డోన్ రూరల్/డోన్ టౌన్: సీపీఐ నాయకులు డి.ఖాశీంసాహెబ్(56) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. పట్టణంలోని శ్రీరాంనగర్‌లో ఉన్న ఆయన ఇంట్లో తెల్లవారుజామున ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు డోన్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. సీపీఐ నాయకులు కె.రామాంజినేయులు, రంగనాయుడు, సుంకయ్య, భీమలింగప్ప, మోటారాముడు, అబ్బాస్, నారాయణ తదితరులు నివాళులర్పించారు.



ఎర్రకాళ్ల కొంగల సందడి

నీటి ఆధారిత ప్రాంతాల్లో ఎర్రకాళ్ల కొంగలు (పెయింటెడ్ స్టోర్క్) సందడి చేస్తున్నాయి. సీజన్ ఆధారంగా వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ చెరువులు, కుంటలు ఉన్న ప్రాంతాల్లో వాలి నీటిలో దాగి ఉన్న పురుగులను ఆహారంగా తీసుకుని కడుపునింపుకుంటున్నాయి. కోవెలకుంట్ల పట్టణ శివారులోని సాయిబాబా గుడి సమీపంలో ఉన్న నీటికుంట వద్ద రెండు కొంగలు ఆహార అన్వేషణలో నిమగ్నమై ఉండగా సాక్షి కెమెరాకు చిక్కాయి.

– కోవెలకుంట్ల



ఐడియా అదుర్స్

పూత దశ నుంచి పిందె దశకు వస్తున్న మామిడికి కోతుల బెడద అధికమైంది. దీంతో మామిడి చెట్లను కోతుల నుంచి రక్షించుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్యాపిలికి చెందిన రైతు మస్తాన్‌ఖాన్ తన తోటలోని మామిడి చెట్ల వద్ద ఇలా బుర్ఖాలు ఏర్పాటు చేశాడు. బుర్ఖాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి కోతులు మామిడి చెట్ల వైపు రావడం లేదని రైతు తెలిపాడు. –ప్యాపిలి

22న మండల సర్వసభ్య సమావేశం

బనగానపల్లె రూరల్: స్థానిక పొదుపు భవనంలో ఈ నెల 22వ తేదీ మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పక హాజరు కావాలని కోరారు.